సాక్షి నంద్యాల

మంగళవారం : 30 : మే : 2023



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేపట్టారు.



కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేశారు.



చర్మం..జర భద్రం

రాష్ట్రంలో పలుచోట్ల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల్లో బయట తిరగడం వల్ల చర్మ సంబంధిత సమస్యలు సోకుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

8లో▸

న్యూస్‌రీల్

అదుపులోకి రాని ఉష్ణోగ్రతలు

- మంత్రాలయంలో 44.38 డిగ్రీలు, చాగలమర్రిలో 44.31 డిగ్రీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఎండలు, వడగాలుల తీవ్రత కొనసాగుతోంది. దాదాపు 15 రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురుస్తున్నట్లుగా ఎండల తీవ్రత ఉంటోంది. ఇటు కర్నూలు, అటు నంద్యాల జిల్లాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలకు అధిక ఉష్ణోగ్రత నమోదవుతోంది. మంత్రాలయంలో 44.38 డిగ్రీలు, చాగలమర్రిలో 44.31 డిగ్రీలు, డోర్నిపాడులో 44.13 డిగ్రీలు, ఆలూరులో 44.04 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో ఒకటి, రెండు రోజులు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు వెల్లడించారు.

మద్దిలేటయ్య హుండీ ఆదాయం రూ.51.58 లక్షలు



శ్రీ మద్దిలేటి నరసింహస్వామి హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి హుండీ ఆదాయం రూ.51.58 లక్షలుగా వచ్చింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడుడు, పాలక మండలి సభ్యులు ఆధ్వర్యంలో 64 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ హుండీ లెక్కింపు ద్వారా రూ.51,58,105 నగదు, 28 గ్రాముల బంగారు, 5.50 కిలోల వెండి వచ్చింది. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు లక్ష్మీనాయుడు, సుశీల, రామ సుబ్బమ్మ, తిమ్మారెడ్డి, లక్ష్మీదేవి, మద్దిలేటి స్వామి, క్రిష్టారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పవన్ వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

19 మంది విద్యార్థులు డిబార్

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షల్లో 19 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. 87 కేంద్రాల్లో ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షలకు 14,742 మంది విద్యార్థులకుగాను 13,893 మంది హాజరయ్యారు. కర్నూలు హజీరా కాలేజీలో ఒకరు, శ్రీచైతన్యలో నలుగురు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ(ఆత్మకూరు)లో ఇద్దరు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షలకు 5,550 మంది విద్యార్థులకుగాను 5,011 మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్నూలులోని నారాయణ జూనియర్ కాలేజీలో ముగ్గురు, ప్రభుత్వ వొకేషన్ కాలేజీలో ముగ్గురు, గాయత్రి జూనియర్ కాలేజీలో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు.

పథకాల అమలులో ఎంపీడీఓల పాత్ర కీలకం



జెడ్పీ చైర్మన్‌కు బొకే ఇస్తున్న నూతన ఎంపీడీఓలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించడంలో ఎంపీడీఓల పాత్ర కీలకమని జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. జిల్లాలోని వివిధ మండల పరిషత్ కార్యాలయాల్లో ఏవోలుగా పనిచేస్తూ ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన పలువురు సోమవారం సాయంత్రం జడ్పీ చైర్మన్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్ శాఖపై ప్రత్యేక దృష్టికి కేంద్రీకరించిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యల కారణంగా వివిధ కేడర్లలో ఉన్న ఉద్యోగులందరికీ పదోన్నతులు లభించాయని చెప్పారు. జడ్పీ చైర్మన్‌ను కలసినవారిలో జి.వెంకటేశ్వరరెడ్డి, గోపికృష్ణ, సీపీ కొండయ్య, దశరథ రామయ్య, అల్లం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



నేను విన్నాను.. నేను చూశాను... నేను ఉన్నానంటూ సరిగ్గా నాలుగేళ్ల క్రితం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారోత్సవ సభలో ప్రజలకు భరోసా ఇచ్చినట్లుగానే సంక్షేమ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగుతోంది. విప్లవాత్మక నిర్ణయాలతో ఊహించని అభివృద్ధి చోటు చేసుకుంటోంది. పేదల ఇళ్లల్లో నవరత్నాలు కాంతులీనుతున్నాయి. నాడు–నేడుతో సర్వసతి నిలయాలు మెరుగుబడి భవిష్యత్ తరానికి బాసటగా నిలుస్తున్నాయి. పల్లెల్లో ప్రగతి దారులు కళకళలాడుతున్నాయి. జగనన్న కాలనీలతో కొత్త ఊర్లు వెలుస్తున్నాయి. నవ నందుల కోట జిల్లా కేంద్రంగా విరాజిల్లుతోంది. నేషనల్ హైవేల అనుసంధానంతో ప్రధాన నగరాలకు మార్గం సుగమం కాబోతుంది. ఇలా ఎన్నో.. అడుగడుగునా అభివృద్ధి జాడలే.. గడపగడపనా సంక్షేమ సంతకమే. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో జిల్లాలో చోటు చేసుకున్న అభివృద్ధి వైభవంపై ప్రత్యేక కథనం.

– నంద్యాల



నవోదయానికి నాలుగు వసంతాలు

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు
- నెరవేరిన నంద్యాల 'జిల్లా' వాసుల కల
- మెడికల్ కళాశాల ఏర్పాటుతో వైద్యానికి ఊపిరి
- పారిశ్రామిక రంగానికి పూర్వవైభవం
- నలుదిక్కులా అభివృద్ధి అడుగులు
- జిల్లా కేంద్రంతో జాతీయ రహదారుల అనుసంధానం
- సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే సేవలు
- నేటితో సంక్షేమ పాలనకు నాలుగేళ్లు పూర్తి

2019కు ముందు అంతా చీకటిమయం.. ప్రజాస్వామ్యం అపహాస్యం.. అంతటా రాజకీయ జోక్యం.. సంక్షేమ పథకాలు అందక విసుపోయిన జనం ఆర్తనాదం.. అవకాశాలు లేక నిరుద్యోగుల నిర్వేదం.. ఎవరిని కదిలించినా కష్టాల జీవితం.. 2019 మే 30 తర్వాత రాజన్న పాలన ప్రారంభమైంది. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం సాకారమైంది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధిగా నిలిచారు. ఆర్బీకేలతో వ్యవసాయానికి పూర్తి స్థాయిలో భరోసా దక్కింది. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతుండటంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేవు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు.. నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పానలతో ప్రజలు బేరీజు వేసుకుని ఆశ్చర్యపోతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలో సంక్షేమ పథకాల నిధులు జమ చేస్తుండటం, అర్హులందరికీ న్యాయం జరుగుతుండటంతో సంక్షేమ పాలనను వెయ్యినోళ్లతో కొనియాడుతున్నారు. సంక్షేమ పాలనలో అభివృద్ధికి పెద్దపీట వేయడంతో జిల్లాలో అభివృద్ధి ఉరకలు వేస్తోంది. జిల్లా నలువైపులా ప్రగతి దారులు.. పారిశ్రామిక వాడలు.. సాగునీటి ప్రాజెక్టుల పనులు కనిపిస్తున్నాయి. ప్రజా సంకల్పపాదయాత్రలో జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ ప్రగతి సారథిగా నిలుస్తున్నారు.



నంద్యాల మండలం మిట్నాల గ్రామంలో ఒకేచోట ప్రభుత్వ భవనాలు

ప్రజల ముంగిట సేవాలయాలు

సచివా లయాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన వచ్చినట్లైంది. జిల్లాలో రూ.165.60 కోట్లతో 414 గ్రామ సచివాలయాల నిర్మాణాలకు పరిపాలన అనుమతులు లభించాయి. జిల్లాలో 516 సచివాలయాల ద్వారా 4,533 ఉద్యోగులు, 8,817 మంది వలంటీర్లతో ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు ఇంటి వద్దకు వెళ్లి అందజేస్తున్నారు. ఇప్పటి వరకు 191 భవనాల పనులు పూర్తయ్యాయి. అలాగు 393 రైతు భరోసా కేంద్రాలను నిర్మించేందుకు పరిపాలనా అనుమతులు లభించాయి. ఇప్పటికే 87 పనులు పూర్తయ్యాయి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా రూ.47.60 కోట్లతో 272 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం 29 హెల్త్‌క్లినిక్ భవన నిర్మాణాలు ఇప్పటికే పూర్తి అయ్యాయి. మిగిలిన భవనాలు నిర్మాణ దశలలో ఉన్నాయి. వీటితో పాటు 27.72 కోట్లతో 168 డిజిటల్ లైబ్రరీలను ప్రభుత్వం నిర్మిస్తుంది. వాటి పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయి.

రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల..



నంద్యాలను జిల్లా చేయడంతో పాటు రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ మంజూరు చేశారు. నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మెడికల్ కాలేజీ ప్రారంభానికి అవసరమైన 360 పడకల ఆసుపత్రి పనులను జూన్ 2022న ప్రారంభమయ్యాయి. మెడికల్ కళాశాల, హాస్టల్ జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసే విధంగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు జరగనున్నాయి.



నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం

విరా'జిల్లా' తుంది..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నంద్యాల ఉప ఎన్నికల సమయంలో నంద్యాలను జిల్లా చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చారు. నంద్యాలను జిల్లాగా ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల చిరకాల కలను నెరవేర్చారు. గతంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు 70–80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలుకు వెళ్లాల్సి వచ్చేది. నేడు నంద్యాల జిల్లాగా ఏర్పడటంతో ఇక్కడే జిల్లా అధికారులు అందుబాటులో ఉంటున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతో పాటు 74 జిల్లా శాఖ కార్యాలయాలు, అధికారులు నంద్యాలలోనే ఉండటంతో ప్రజలకు సేవలు అందడం సులభతరమైంది. జిల్లా కలెక్టర్, ఎస్పీలు నంద్యాలలోనే ఉండటంతో అధికారులపై పర్యవేక్షణ పెరిగింది.



పండుగలా వ్యవసాయం

చంద్రబాబు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నంద్యాల జిల్లా వ్యాప్తంగా వరుసగా నాలుగేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.1,124.45 కోట్ల సాయం అందింది. ఐదో ఏడాది మొదటి విడత కింద రూ.120.97 కోట్ల సాయం మరో రెండు రోజుల్లో అందనుంది. అలాగే వైఎస్సార్ యంత్ర సేవ కింద 411 మంది రైతులకు రూ.25.28కోట్లతో యంత్రాలు పంపిణీ చేశారు.



డోన్ జగనన్న కాలనీ

నెరవేరుతున్న పేదల సొంతింటి కల

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా పల్లెలు కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. జిల్లాలో జగనన్న హౌసింగ్ కాలనీలో 22,747 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడమే కాకుండా వారికి ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 8,595 ఇళ్లు పూర్తి కాగా 37,427 ఇళ్లు పురోగతిలో ఉండగా, 1,272 ఇళ్లు ప్రారంభ దశలో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలకు రూ.274.76 కోట్లు ఇప్పటి వరకు ప్రభుత్వం ఖర్చు చేసింది.


ఇక 'హాయి'వేలు..



నంద్యాల జిల్లా కేంద్రంగా మీదుగా కొత్తగా జాతీయ రహదారుల నిర్మాణం జరుగబోతుంది. తెలంగాణలోని కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 174కి.మీ జాతీయ రహదారి నిర్మించనున్నారు. ఈ జాతీయ రహదారి కృష్ణానది మీదుగా సంగమేశ్వరం వద్ద జిల్లాలోకి ప్రవేశించి నంద్యాల వరకు సాగుతోంది. ఈ జాతీయ రహదారిని నంద్యాల నుంచి జమ్ములమడుగు వరకు చేపడుతున్న జాతీయ రహదారిలో అనుసంధానం చేయనున్నారు. అలాగే ఆత్మకూరు నుంచి నంద్యాల వరకు రూ.843.67కోట్లతో ఎన్‌హెచ్–167కే, నంద్యాల నుంచి జమ్మలమడుగు వరకు రూ.815కోట్లు, సోమయాజులపల్లె, డోన్ వరకు రూ.629.73కోట్లతో నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మించడానికి నిధులు మంజూరు అయ్యాయి. ఇందుకు సంబంధించిన పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

పారిశ్రామిక వెలుగులు..

పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి అన్ని వనరులు ఉండటంతో పెద్దపెద్ద పరిశ్రమలు జిల్లాకు తరలివస్తున్నాయి. జిల్లాలోని పాణ్యం మండలంలో గ్రీన్‌కో ఆధ్వర్యంలో రూ.18వేల కోట్లతో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 2వేల ఎకరాల్లో హైడ్రో పవర్, సోలార్, పవన విద్యుత్ కేంద్రాలను నిర్మించడానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది మే 16న ప్రారంభించారు. కొలిమిగుండ్ల మండలంలో గత ఏడాది సెప్టెంబర్ 28వ తేదీన రూ.1790 కోట్లతో నిర్మించిన రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీని సీఎం



ప్రారంభించారు. ఇటీవల కొలిమిగుండ్లలో రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీని విస్తరించారు. నంద్యాలలో పెట్టుబడులు పెట్టడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. అలాగే జిల్లాలో జిల్లాలో ఇప్పటికే జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఫ్యాక్టరీ, జయజ్యోతి సిమెంట్, రైన్ సిమెంట్ ఫ్యాక్టరీ, సుజల పైప్స్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ బాట్లింగ్, ఇథేల్ ఆల్కహాల్ కంపెనీ, ఎస్పీవై ఆగ్రో, రైన్ ఇండస్ట్రీస్ పవర్ జనరేషన్ పరిశ్రమలు వంటివి ఉండగా జిల్లాలో నూతనంగా మరో నాలుగు పరిశ్రమలు రాబోతున్నాయి. నందికొట్కూరు నియోజకవర్గంలో రూ.365 కోట్లతో మెగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వీటికి భూ సేకరణ పనులు, అనుమతులు సైతం పొందాయి. ఈ పరిశ్రమలు ఏర్పాటైతే 9,539 మందికి ఉపాధి అవకాశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లభించనున్నాయి.

సాగునీటి రంగం మురిసి'నది'



కృష్ణా జలాలను సమృద్ధిగా వినియోగించుకునేలా ప్రభుత్వం ఒడిసిపడుతోంది. ఈ మేరకు జిల్లాలో కుందూనది ప్రస్తుత సామర్థ్యం 10వేల క్యూసెక్కులు కాగా 35వేల క్యూసెక్కుల సామర్థ్యం పెంచడానికి నది విస్తరణ ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలోని నిప్పుల వాగు నుంచి కడప జిల్లాలోని పెన్నా నది వరకు 189 కిలోమీటర్లు రూ.1750 కోట్లతో కుందూనది విస్తరణ జరుగుతున్నాయి. ఈ పనుల్లోనే భాగంగానే రాజోలి, జోళదరాశి రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే కుందూనది వెంట ఉన్న గ్రామాలకు ముంపు ముప్పు తొలిగిపోవడంతో పాటు సాగునీటి కష్టాలు పరిష్కారం కానున్నాయి. అలాగే అవుకు రిజర్వాయర్ వద్ద మూడో సొరంగం పనులు రూ.400 కోట్లతో ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే పాణ్యం పరిధిలో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు రూ.800 కోట్లతో జరుగుతున్న గాలేరు నగరి లైనింగ్ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి.

బడి.. నూతన ఒరవడి..



విద్యా రంగానికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేసింది. విప్లవాత్మక మార్పులతో పేదలకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు నాడు–నేడు కింద పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా దీటుగా తీర్చిదిదుతున్నారు. మొదటి విడత జిల్లాలో 486 పాఠశాలలను రూ.117 కోట్లతో పనులు పూర్తి చేయడంతో సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. రూ.364.74 కోట్లతో రెండో విడత 959 పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యాయి. జగనన్న గోరుముద్దతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూను మార్చేసి పౌష్టికాహారం అందిస్తున్నారు. 852 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. 321 పాఠశాలల్లో అదనంగా నూతన భవనాల నిర్మాణం కోసం రూ. 141.23 కోట్లు వెచ్చిస్తోంది. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలు ఆట స్థలాలను రక్షించేందుకు జిల్లాలోని 395 పాఠశాలలకు రూ.54.71 కోట్లతో ప్రహరీలను నిర్మిస్తున్నారు.

జిల్లా చేయడంతో ఎంతో మేలు



జిల్లాల పునర్విభజనలో నంద్యాలను జిల్లానే చేయడం ఎంతో ఉపయోగంగా మారింది. మా ఊరి నుంచి అరగంటలో జిల్లా కేంద్రానికి వెళ్తున్నాం. అదే కర్నూలుకు వెళ్లాలంటే నంద్యాల మీదుగా 110 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కలెక్టర్, ఎస్పీ ఇతర జిల్లా అధికారులను కలిసేందుకు వీలు కలిగింది.

– రామిరెడ్డి, గుండుపాపల, డోర్నిపాడు మండలం

కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు



నాడు–నేడు పథకం ద్వారా పట్టణ, గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. మా ఊరి పాఠశాలలో అదనపు గదులు నిర్మించడంతో పాటు మౌలిక వసతులు కల్పించడం ఆనందంగా ఉంది.

– మహేశ్వరుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, గోస్పాడు

అభివృద్ధి అంటే ఇదే



ప్రజలకు ఏమి అవసరమో గుర్తించి అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ బాధ్యత. ఆ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించింది. భవనాలు అన్ని ఒకే చోట నిర్మించడంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంది. రైతు భరోసా కేంద్రం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– తిరుపతిరెడ్డి, రైతు, మిట్నాల, నంద్యాల మండలం

గతుకుల రోడ్లు లేవు



నేను మా ఊరి నుంచి ప్రతి రోజూ నంద్యాలకు ఆటో నడుపుతున్నా. గతంలో రోడ్లపై గుంతలు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. నా ఆటో కూడా తరచుగా మరమ్మతుకు గురయ్యేది. ప్రస్తుతం రోడ్డు బాగుచేయడంతో ప్రయాణం సాఫీగా సాగుతుంది. మారుమూల గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేయడం హర్షణీయం.

– రంగస్వామి, ఆటోడ్రైవర్, జిల్లెల్ల, గోస్పాడు మండలం

కోవిడ్ నుంచి కాపాడారు



కోవిడ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం అండగా నిలిచింది. కోవిడ్ సోకిన వారికి నంద్యాల పట్టణంలో టిడ్కో గృహాల్లో ఉంచి వైద్య సేవలతో పాటు నాణ్యమైన భోజనం అందించి సాయం చేసింది. కోవిడ్‌కు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేసి ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం ఉచితంగా చికిత్స అందించిన సీఎంను ఎన్నటికీ మరువరు.

– చెన్నకేశవ, వ్యాపారి, నంద్యాల

సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు మెరుగు

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి
- ప్రభుత్వ ఐటీఐలో మోడ్రన్ ల్యాబ్ ప్రారంభం

డోన్ టౌన్: సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో కియా మోటర్స్ వారి సౌజన్యంతో యువతకు ఆధునిక యంత్రాలపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన మోడ్రన్ ల్యాబ్‌ను సోమవారం కియా ఎండీ తేజిన్ పార్క్, కలెక్టర్ మనజీర్ జిలానీ, స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ఎండీ వినోద్, ఉపాధి మరియు శిక్షణ అధికారిణి నవ్యతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు సమాజ అభివృద్ధికి పాటు పడాలని, పదవీ ఆర్భాటంతో సరి పెట్టుకోకూడదన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డోన్ ప్రాంతం విద్యలో వెనుకబడిందన్నారు. డోన్ ప్రాంత



ఆధునిక యంత్రాలను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన, కియా ఎండీ తేజిన్ పార్క్, కలెక్టర్ మనజీర్ జిలానీ తదితరులు

ప్రజలకు మెరుగైన వసతులతో ఉన్నత విద్యను అందుబాటులో తెచ్చి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో ఐటీఐలో రూ. 10 కోట్లతో వసతి గృహం, మౌలిక సదుపాయాలతో పక్కా భవనాలు, రుద్రాక్ష గుట్ట వద్ద బీసీ బాలికల గురుకుల కళాశాల, నర్సింగ్ కళాశాల, ప్యాపిలి మండలంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, గొర్రెల పెంపక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం, మోడరన్ మార్కెట్, బేతంచెర్ల బాలుర రెసిడెన్షియల్ కళాశాల, పాలిటెక్నిక్, ఐటీఐలు తదితర విద్యా సంస్థలను నెలకొల్పుతున్నామన్నారు. త్వరలో వీటి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. కియా మోటార్స్ వారి సౌజన్యంతో రూ.1.60 కోట్లతో ఆధునిక టెక్నాలజీ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కియా మోటర్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్‌డాంగ్‌లీ, ఆర్డీవో వెంకటరెడ్డి, తహశీల్దార్ విద్యాసాగర్, రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పోస్టు ప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ అధ్యక్షులు రామచంద్రుడు, ఐటీఐ ప్రిన్స్‌పాల్ బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనపై కియాతో ఒప్పందం..

రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్, ప్రభుత్వ ఐటీఐల్లో శిక్షణ పొందిన యువతకు కియా మోటార్స్ కార్ల తయారీ సంస్థలో ఉపాధి అవకాశాలు కల్పించేలా ఒప్పందం చేసుకున్నారు. ముఖ్యంగా డోన్ నియోజకవర్గం నుంచి ప్రతి సంవత్సరం దాదాపు వంద మందికి అవకాశం కల్పించనున్నట్లు వారు తెలిపారు.

క్లుప్తంగా

పోలీసు స్పందనకు 71 ఫిర్యాదులు



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్ర మాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.స్పందనకు మొత్తం 71 ఫిర్యాదులు రాగా,వాటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితుల సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీహామీ ఇచ్చా రు. డీఎస్పీ యుగంధర్ బాబు,లీగల్ అడ్వైజర్ మ ల్లి కార్జునరావుతదితరులుస్పందనలో పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన బీబీ

చాగలమర్రి: చాగలమర్రిలో ని భవానీ నగర్ కాలనీకి చెందిన షేక్ అచ్చుకట్ల బీబీ(35) సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. బీబీ భర్త ఫక్ృద్దీన్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఫకృద్దీన్ మద్యానికి బానిసై తరచూ భార్యను వేధిస్తున్నాడు. దీంతో సోమవారం మనస్తాపం చెందిన బీబీ క్రిమిసంహారక మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానిక కేరళా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించటంతో కోలుకోలేక మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చర్మం.. జర భద్రం!



సన్ బర్న్స్‌తో జాగ్రత్త అంటున్న నిపుణులు

- ఎండలో ప్రయాణాలతో చర్మ సమస్యలు
- వేసవిలో బిగుతు వస్తువులు ధరించడంతో ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు

లబ్బీపేట (విజయవాడ తూర్పు)

రాష్ట్రంలో పలుచోట్ల అత్యధిక ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. ఈ దశలో బయట తిరగడం వల్ల చర్మ సంబంధ వ్యాధులు సోకుతాయని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ అతి నీలలోహిత కిరణాలు నేరుగా భూమిపై పడతాయి. ఇవి మానవ శరీరంపై చర్మ వ్యాధులతోపాటు ఇతర సమస్యలు కలగజేస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా సన్ బర్న్స్, రాష్ (చెమట పొక్కులు), చెమట గ్రంథుల వల్ల ఏర్పడే గడ్డలు (ఉడుకు గడ్డలు), ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చికున్ ఫాక్స్, సన్ ఎలర్జీ, ఇతర చర్మ వ్యాధులతోపాటు మహిళలు మంగు వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఎండలో తిరిగే వారితోపాటు ఉక్కపోత ప్రాంతాల్లో ఉండే వారు సైతం ఇలాంటి వ్యాధుల బారిన పడతారు. ఎండాకాలంలో వచ్చే సమస్యలివీ.

సన్ బర్న్స్

ఎండలో ఎక్కువగా తిరిగే వారు సన్ బర్న్స్‌కు గురవుతుంటారు. దీనివల్ల చర్మం అంతా కాలినట్టు మచ్చలు ఏర్పడతాయి. దీనిని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. సన్‌బర్న్స్‌కు గురైన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. నీరు, పానీయాలు సేవించాలి.

ఉడుకు గడ్డలు

ఇవి చెమట గ్రంథుల వల్ల ఏర్పడతాయి. అధిక ఉష్ణోగ్రతల్లో ఉండే వారికి ఎక్కువగా వస్తుంటాయి. చిన్నపాటి సెగ గడ్డలుగా వస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. వీటి నివారణకు క్రీమ్స్, పౌడర్స్ అందుబాటులో ఉన్నాయి. వైద్యుని సలహా మేరకు యాంటీబయోటిక్ మందులు వాడాలి.

చెమట కాయలు

ఎండలో తిరిగే వారికి ఎక్కువగా రాష్ వస్తుంది. గాలి సోకని మందమైన దుస్తులు, సిల్క్ దుస్తులు ధరించిన వారు దీని బారిన పడతారు. దీనివల్ల చర్మమంతా కంది పోయినట్టు అనిపించడం, పొక్కులు రావడం జరుగుతుంది. వీటిని వైద్యుని సలహా మేరకు సన్‌స్క్రీన్ లోషన్స్ వాడటం ద్వారా అరికట్టవచ్చు.

ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు

బిగుతుగా ఉండే వస్త్రాలు ధరించే వారికి.. స్నానం చేసిన తర్వాత చర్మాన్ని సరిగ్గా తుడుచుకోకుండా వస్త్రాలు ధరించే వారికి ఎక్కువగా ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. తొడల మధ్య తామర మాదిరిగా వచ్చి దురదలు ఎక్కువగా ఉంటాయి. ఇటువంటి వారు గోరు వెచ్చని నీటితో స్నానం చేయడంతోపాటు తేమ లేకుండా చర్మాన్ని శుభ్రంగా తుడిచి సంబంధిత కొలనైన్ లోషన్లు రాయడం ద్వారా అరికట్టవచ్చు.

చికెన్‌ఫాక్స్

వేసవిలో వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో చికెన్‌ఫాక్స్ కూడా ఎక్కువగా సోకుతుంది. ఈ వ్యాధిపై మూఢనమ్మకాలు ఉండటంతో ఎక్కువ మంది మందులకు దూరంగా ఉంటారు. దీంతో ముఖంపై గుంటలు పడటం వంటివి చోటుచేసుకుంటాయి. సకాలంలో మందులు వాడితే చర్మంపై ప్రభావం పడదు. సన్ ఎలర్జీతో చర్మంపై దద్దుర్లు , దురదలు వస్తాయి. దీని కారణంగా రాత్రి వేళ నిద్ర సరిగా పట్టదు.

ఈ జాగ్రత్తలు మేలు

- వేసవిలో శరీరానికి నూనె వంటి పదార్థాలు, సన్‌స్క్రీన్ లోషన్స్ రాసుకోవాలి.
- ఎక్కువగా ఎండకు ఎక్స్‌పోజ్ కాకుండా గొడుగు, తలకు టోపీ ధరించాలి.
- లూజు దుస్తులు, కాటన్ దుస్తులు వేసుకోవాలి.
- రాత్రి వేళల్లో సైతం గాలి సోకే ప్రదేశంలో నిద్రించాలి.
- స్నానం అనంతరం చర్మానికి పౌడర్ రాసుకుంటే చెమట పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు నివారించవచ్చు.
- ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ సోకిన వారు వాడిన టవల్స్‌ను మరొకరు వాడితే వారికీ ఇవి సోకే అవకాశం ఉంది. అందువల్ల టవల్స్‌ను వేడి నీటితో నానబెట్టి వాష్ చేయాలి.

ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలి

ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నా.. తగిన జాగ్రత్తలు పాటిస్తే చర్మ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. చికున్‌ఫాక్స్ విషయంలో మూఢనమ్మకాలకు పోకుండా మందులు వాడితే దాని ప్రభావం ముఖంపై పడదు. తేలికపాటి ఆహారం, ఆకు కూరలు, పళ్లు తీసుకుంటే చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవచ్చు.

– డాక్టర్ సీహెచ్ మమత, డెర్మటాలజిస్ట్, విజయవాడ

టైర్లు పేలి లారీ బోల్తా

- డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు
- స్తంభించిపోయిన ట్రాఫిక్



రోడ్డుకు అడ్డుగా పడిపోయిన ఎర్రమట్టి లారీ,



రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు

ఎమ్మిగనూరురూరల్: ఎర్రమట్టితో వెళ్తున్న లారీ వెనక రెండు టైర్లు పేలి రోడ్డు మధ్యలో బోల్తాపడింది. దీంతో లారీలో ఉన్న డ్రైవర్ కిషోర్, క్లీనర్ మధు గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం బెల్గాం నుంచి గడివేముల సమీపంలోని జిందాల్ ఫ్యాక్టరీకి ఎర్రమట్టిని తీసుకెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఎర్రకోట – శ్రీ మహాలక్ష్మీ జిన్నింగ్ మిల్లు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డుకు అడ్డంగా లారీ పడిపోవటంతో కర్నూలు, ఆదోని వైపు వెళ్తున్న వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని లారీని ఉదయం 8 గంటల సమయంలో రోడ్డు పక్కకు తొలగించారు. దీంతో రాకపోకలు సాఫీగా సాగాయి. గాయపడ్డ డ్రైవర్, క్లీనర్లను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఆర్‌బీకేలకు 'మూడేళ్లు'

- స్వల్పకాలంలోనే రైతులకు చేరువ
- గ్రామాల్లోనే వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలు
- ఉపాధి నిధులతో సొంత భవనాలు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయం, అనుబంధ శాఖల సేవలు ఒకేచోట రైతులకు అందించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దారు. డాక్టర్ ఎం.ఎం. స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా వీటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన సీఎం దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారు. 2020 మే నెల 30న రైతుభరోసా కేంద్రాలను ముఖ్యమంత్రి ప్రారంభించగా.. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదికే వీటిని ప్రారంభించడం విశేషం. ఆర్‌బీకేలు ఏర్పడి నేటికి సరిగ్గా మూడేళ్లు. స్వల్ప కాలంలోనే ఆర్‌బీకేలు రైతుల నిత్య జీవితంలో భాగమయ్యాయి. వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు ఇతర సామగ్రి ఇప్పుడు గ్రామాల్లోనే అందుతుండటం రైతులకు ఊరటనిస్తోంది. ఆర్‌బీకేల ద్వారా ఒక్క వ్యవసాయ శాఖ ద్వారానే 28 రకాల సేవలు.. అనుబంధ శాఖల ద్వారా మరో 20 సేవలు అందిస్తున్నారు. ఇక రైతు భరోసా కేంద్రాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నూతన భవనాలను నిర్మిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 877 ఆర్‌బీకేలు ఉండగా.. ఉపాధి నిధులు రూ.184.77 కోట్లతో 845 భవన నిర్మాణాలకు జిల్లా యంత్రాంగం అనుమతిచ్చింది. ఇందుకు సంబంధించిన పనులు ముమ్మరం సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పూర్తికాగా.. మరికొన్ని పురోగతిలో ఉన్నాయి.



వెల్దుర్తిలో ఉపాధి నిధులతో నిర్మించిన ఆర్‌బీకే భవనం

విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి



నాగార్జున (ఫైల్)

ప్యాపిలి: మండలంలోని మాదినేనిదొడ్డి గ్రామానికి చెందిన నాగార్జున (26) సోమవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఇంటి వద్ద కుళాయి నీరు పట్టుకునేందుకు మోటార్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌తో గుంతలో పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని ప్యాపిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం డోన్‌కు తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య లలిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

మృతురాలి వివరాలు లభ్యం

అవుకు: మండలంలోని పాత చెర్లోపల్లె గ్రామంలోని పాఠశాల గదిలో ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. కాగా సంజామల మండలం ఆకుమళ్ల గ్రామానికి చెందిన మన్నే పుల్లమ్మ (75)గా గుర్తించామని పోలీసులు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందిందని మృతురాలి కుమారుడు మన్నే మేరయ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

ప్రొబేషన్ డిక్లేర్ అయితేనే బదిలీలకు అర్హులు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయా ల్లో రెండు సంవత్సరాల ప్రొ బేషన్ డిక్లేర్ అయిన ఉద్యోగులు బదిలీలకు అర్హులని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభు త్వం సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీలకు అర్హత కలిగిన ఉద్యోగులు జూన్ 3లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో సచివాలయాలకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఆయా సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఎలాంటి చార్జెస్.. ఏసీబీ, తదితర ఫిర్యాదులు పెండింగ్ ఉండరాదన్నారు. ముఖ్యంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ పరిధిలోని ఖాళీల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. వివిధ కారణాల వల్ల మహిళా పోలీసులకు సంబంధించి వంద మంది ఉద్యోగులకు పైగా ప్రొబేషన్ డిక్లేర్ కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే పరిష్కరిస్తే బదిలీలకు అర్హత సాధిస్తారని పోలీస్ శాఖను కోరామన్నారు. సమావేశంలో డీఎల్‌డీఓ బాలక్రిష్ణారెడ్డి, ఎంపీడీఓలు ఎస్.భాస్కర్‌నాయుడు, ఆంథోని, చంద్రశేఖర్, రమణమూర్తి, జీఎస్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షకులు సి.మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జి నాసరరెడ్డి

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- ఐఎఫ్‌ఎస్ ప్రిన్సిపల్ చీఫ్ మధుసూదన్‌రెడ్డి

ఆళ్లగడ్డ: అడవి, వన్య ప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఐఎఫ్‌ఎస్ ప్రిన్సిపల్ చీఫ్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. అహోబిలం అటవీ ప్రాంతంలోని శీతల్ బేస్ క్యాంపులో పరిధిలోని రిజర్వ్ ఫారెస్టులో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అగ్నిమాప్రమాదాలు జరుగకుండా ముందస్తు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి తీసుకోవల్సిన చర్యలపై స్థానిక అటవీ అధికారులకు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన వెంట ఎఫ్‌డీపీటీ శ్రీనివాసరరెడ్డి, డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్, రేంజ్ అధికారి శ్రీపతినాయుడు, డీఆర్వోలు ముర్తుజావలి, నాగేంద్రనాయక్‌లు ఉన్నారు.

క్యాంప్ కార్యాలయం ప్రారంభం

నంద్యాల(రూరల్): సోమవారం పట్టణంలోని డీఎఫ్‌ఓ కార్యాలయంలో ఆధునికీకరించిన నూతన క్యాంప్ కార్యాలయాన్ని ఐఎఫ్‌ఎస్ ప్రిన్సిపల్ చీఫ్ మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సమీపంలోని గ్రామాల ప్రజలకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీటీ శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఆర్ఓ శివన్న, డిఆర్ఓ నాగేంద్ర నాయక్, ఎఫ్ఎస్ఓలు జాకీర్ హుస్సేన్, పరమేశ్వరి, ఎఫ్‌బీఓలు శ్రీనివాసులు, తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అహోబిలం రిజర్వ్ ఫారెస్ట్‌ను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి, అటవీ అధికారులు

స్పందన వినతులను పరిష్కరించండి

- జాయింట్ కలెక్టర్ నిశాంతి

నంద్యాల: స్పందనలో వచ్చే ప్రతి దరఖాస్తును నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నిశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ డీఆర్ఓ పుల్లయ్యతో కలిసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ స్పందన కంటే మెరుగ్గా ఉండేలా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సీఎం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని, వాటి కింద నమోదైన దరఖాస్తులను 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీ ఓపెన్ అయిన దరఖాస్తులన్నిటిని అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలన్నారు. స్పందనలో 183 దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- కోవెలకుంట్ల మండలం చిన్న కొప్పెర్ల గ్రామానికి చెందిన బాలబ్రహ్మయ్య తన తండ్రి నుండి సంక్రమించిన పొలాన్ని రెవెన్యూ అధికారులు ఇతరుల పేరు మీద పాసు పుస్తకాలు ఇవ్వడానికి చూస్తున్నారని, అలా జరగకుండా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- వికలాంగుల పింఛన్ ప్రతి నెల వచ్చేదని, అయితే ఈ మధ్యలో ఆగిపోయిందని అధికారులు, సచివాలయ ఉద్యోగులు అడిగితే సరైన కారణం తెలపడం లేదని, ఆగిపోయిన పింఛన్‌ను మళ్లీ మంజూరు చేసి న్యాయం చేయాలని నంద్యాల మండలం మునగాల గ్రామానికి చెందిన రామచంద్రయ్య జాయింట్ కలెక్టర్‌ను కోరారు.
- ఇళ్ల పట్టాలు మంజూరు చేసినా ఇల్లు కట్టుకునే స్తోమత లేదని, ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలని వెలుగోడు మండలం వెలుగోడు చెంచు కాలనీకి చెందిన 50 మంది జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



అర్జీలను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నిశాంతి

తేలు కాటుకు బాలుడి మృతి



మృతి చెందిన భరత్

ఆస్పరి: తేలు కాటుకు గురై భరత్ (10) అనే బాలుడు సోమవారం మృతి చెందా డు. హలిగేర గ్రామానికి చెందిన సరస్వతి, నల్లగుట్టయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడైన భరత్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి పూర్తి చేశాడు. పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో సోమవారం తల్లిదండ్రులతో కలిసి పొలం పనులకు వెళ్లగా తేలు కాటు వేసింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం వెంటనే ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు, అక్కడ కోలుకోలేక బాలుడు మృతి చెందాడు.

ఆసుపత్రి ఎదుట ఆందోళన...

ఆదోని టౌన్ : వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతిచెందాడని బాలుడు భరత్ తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. ఆదోనిలోని ప్రభుత్వ ఆసుపత్రి కొంతసేపు డాక్టర్లతో వాగ్వాదం చేశారు. సకాలంలో వైద్యం అందించి ఉంటే తమ కుమారుడు బతికి ఉండేవాడని, కేవలం డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రాణాలు కోల్పోయాడని కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లారు. బాలుడి మృతిపై విచారణ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్నను కోరారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బేతంచెర్ల: మండ్లవానిపల్లె గ్రామానికి చెందని ఓ వ్యక్తి అప్పుల బాధతాళ లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తలారి చిన్న మద్దయ్య తనకు ఉన్న నాలుగు ఎకరాల పొలంతో వ్యవసాయం చేసుకుంటూ మరో 8 ఎకరాలు మామిడి తోటలు కౌలుకు తీసుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సరైన దిగుబడులు రాకపోవడంతో సుమారు రూ.14 లక్షల దాక అప్పులు చేశాడు. తెచ్చిన అప్పులు ఏవిధంగా తీర్చాలో అర్థంకాక మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలారి చిన్న మద్దయ్య (65) చీరెతో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందికి దించి చూసే సరికి అప్పటికే మరణించాడు. మృతుని భార్య నాగమ్మతో పాటు ఇద్దరు కొడుకులు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.